క్లుప్తంగా

సాంకేతికతతో ఆవిష్కరణలు

న్యాయమూర్తి స్వాతిరెడ్డి



ప్రదర్శనలను తిలకిస్తున్న స్వాతిరెడ్డి

సిద్దిపేటజోన్: విద్యార్థులు సాంకేతికతతో కొత్తకొత్త ఆవిష్కరణలు చేయాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి సూచించారు. గురువారం మెరిడీయన్ పాఠశాలలో జరుగుతున్న రోబోటిక్ గాలా ప్రదర్శనను తిలకించారు. విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాల గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ రాజేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉండాలి



మెడల్స్ ప్రదానం చేస్తున్న హనుమంతరావు

మిరుదొడ్డి(దుబ్బాక): యువత మత్తుకు బానిసగా మారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని ఇక్రిశాట్ విశ్రాంత శాస్త్రవేత్త హనుమంతరావు అన్నారు. రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్, సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని మల్లుపల్లిలో గురువారం 2కే రన్ నిర్వహించారు. యాంటీ డ్రగ్స్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విన్నర్లకు మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతా ల్లో డ్రగ్స్ నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం హర్షించదగిన విషయమన్నారు. కార్యక్రమంలో రన్ ఫర్ యాంటీ డ్రగ్స్ యూత్ ఫోర్స్ ఆర్గనైజర్ తోట కమలాకర్ రెడ్డి, రన్నర్స్ అసోసియేన్ ప్రతినిధి నునిగాని రాజు, నాయకులు సూకూరి లింగం, వడ్లూరి నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ తుమ్మల బాల్‌రాజు, మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ అహ్మద్, మాజీ ఎంపీటీసీ భైరయ్య, ధర్మారం కుమార్, ఎల్లం తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు



సర్వే పరిశీలిస్తున్న వెంకటస్వామిగౌడ్

దుబ్బాక: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందజేస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకటస్వామిగౌడ్ అన్నారు. గురువారం ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు న్యాయమే చేయడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు సుమలత, కమిటీ సభ్యులు వెంకటేశం, చందు, విజయ తదితరులు ఉన్నారు.

గురుకుల పాఠశాల పరిశీలన



బియ్యాన్ని పరిశీలిస్తున్న రవి తదితరులు

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించారు. వంటగది, నిత్యావసర సరుకులు, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కొంత మంది చేస్తున్న ఆరోపణల నేపథ్యంలో స్థానిక గురుకుల హాస్టల్ సందర్శించామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రవి, నాయకులు యాదగిరి, రాకేశ్, సంతోష్‌రెడ్డి, భానుప్రకాశ్, సన్ని, మోహన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారం అవసరం



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న స్వామీజీ

గజ్వేల్: సనాతన ధర్మ పరిరక్షణకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని సనాతన హిందు ధర్మ జాగృతి సేవా సంస్థ బాధ్యులు సద్గురు మహాదేవ్ స్వామీజీ పిలుపునిచ్చారు. 22న బీరంగూడలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయంలో నిర్వహించనున్న మహాసభకు సంబంధించిన కరపత్రాలను గురువారం గజ్వేల్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ సనాతన ధర్మంపై జరుగుతున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో విభాస్ సంస్థ నిర్వాహకులు డాక్టర్ కుమారస్వామి, ప్రముఖ వైద్యుడు నరేశ్‌బాబు, నాగ మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియం తోనే సారవంతం

•రసాయన మందులు తగ్గించాలి •ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి మేలు •అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్

రసాయన ఎరువులు, పురుగు మందులకు బదులు పర్యావరణానికి మేలుచేసే జీవన ఎరువులు, జీవ నియంత్రకాలను వాడితేనే భూమికి సారం, పర్యావరణానికి హితం. రసాయన ఎరువుల వాడకం పెరగడం వల్ల రోజురోజుకు భూసారం దెబ్బతింటోంది. దీంతో భవిష్యత్‌లో పంటలపై ప్రభావం చూపుతుంది. దిగుబడి ప్రశ్నార్థకంగా మారుతుంది.



పారించడానికి ప్లాస్టిక్ డ్రమ్ముల్లో ఉంచిన జీవామృతం



వేస్ట్ డీ కంపోజర్ ద్రావణం

సిద్దిపేటఅర్బన్: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అందరికీ ఆహారం అందాలనే ఉద్దేశ్యంతో తీసుకు వచ్చిన హరిత విప్లవం కారణంగా రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం ఎక్కువైంది. దానికి తోడు హైబ్రిడ్ విత్తనాలు సాగుచేయడం వల్ల భూములు నిస్సారంగా మారాయి. ఆహార ధాన్యాలు, కూరగాయలు విష తుల్యంగా మారుతున్నాయి. అందుకే సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని అర్బన్ మండల ఏఓ శ్రీనాథ్ సూచించారు. ఆయన రైతులకు పలు సూచనలు చేశారు.

సేంద్రియ సాగు లేదు

రసాయనిక ఎరువుల వల్ల ప్రజలు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ఆ స్థితి నుంచి బయట పడాలంటే ఏకైక మార్గం సేంద్రియ వ్యవసాయం. అర్బన్ మండలం వ్యాప్తంగా 14,355 ఎకరాలలో వివిధ పంటలు సాగుచేస్తుండగా అందులో 12,980 ఎకరాలలో వరి, 270 ఎకరాలలో మొక్కజొన్న, 502 ఎకరాలలో పత్తి, 409 ఎకరాలలో కంది సాగవుతోంది. వాటిలో ఒక్క శాతం విస్తీర్ణంలో కూడా సేంద్రియ పద్ధతిలో సాగు చేయడం లేదు. జీవామృతం, వేస్ట్ డీకంపోజర్ వంటివి వాడడంతో నేలలోని హానికర రసాయనిక అవశేషాలను సైతం కరిగించి నేలను సారవంతం చేయడానికి దోహద పడతాయి.

రసాయన వ్యవసాయం వల్ల కలిగే నష్టాలు

- పురుగు మందుల, ఎరువుల వినియోగం వల్ల పంట ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు ఉండడం వల్ల రోగాల బారిన పడే అవకాశం ఎక్కువ.
- పురుగు మందులు, ఎరువుల కొనుగోలుకు అధిక ఖర్చవుతుంది.
- వాటి వినియోగంతో వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. పంటలకు మేలుచేసే మిత్ర పురుగులు, తేనె టీగలు, వానపాములు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడుతుంది.
- నేల ఆరోగ్యం దెబ్బతిని భూసారం తగ్గుతుంది. నేల సాంద్రత తగ్గి నీటిని నిల్వ చేసుకునే గుణం కోల్పోతుంది.
- నేల ఆరోగ్యం దెబ్బతినడం వల్ల భవిష్యత్‌లో రసాయనిక ఎరువులు, పురుగు మందులు, కలుపు నివారణ మందులు లేకుండా పంటలు పండించే పరిస్థితి ఉండదు
- జీన్ మాడిఫైడ్ ఆర్గానిజమ్స్ ప్రాధాన్యం పెరిగి పాత వంగడాలు కనుమరుగవుతాయి

సేంద్రియ వ్యవసాయం వల్ల లాభాలు

- మంచి పోషక విలువలు కలిగిన పంట ఉత్పత్తులు లభిస్తాయి
- పంటలు రోగాలు, పురుగుల ఉధృతిని తట్టుకొనే శక్తిని కలిగి ఉంటాయి
- పురుగు మందుల వాడకం ఉండదు కాబట్టి వాతారణ కాలుష్యం తగ్గుతుంది
- నేల సారవంతంగా మారి మొక్కలకు పోషకాలు సమగ్రంగా అందుతాయి
- మంచి రుచికరమైన పంట ఉత్పత్తులు లభిస్తాయి
- సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉండి అధిక ధర వస్తుంది.
- నేల, నీరు, వాతావరణ కాలుష్యం తగ్గి పర్యావరణానికి మంచి జరుగుతుంది
- సహజంగా దొరికే జీవ వ్యర్థాలు, జీవ ఎరువుల వాడకంవల్ల ఖర్చు తగ్గుతుంది
- విత్తనాలను జీన్ మాడిఫైడ్ చేయాల్సిన అవసరం ఉండదు. తద్వారా జీవ వైవిధ్యానికి రక్షణ కలుగుతుంది

సేంద్రియ వ్యవసాయంతో ఆరోగ్యకరమైన సమాజం



మన పూర్వీకులు మనకు సారవంతమైన, పంటలకు మేలుచేసే కోటానుకోట్ల సూక్ష్మజీవులను కలిగిన భూమిని అందించారు. అలాంటి భూమిని రసాయన మందులు, ఎరువులు వాడి నిస్సారం చేస్తున్నాం. రసాయనాలు వాడకుండా పండించిన కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలను తినడం వల్ల ఆరోగ్యంగా ఉంటాం. సేంద్రియ వ్యవసాయం వల్ల ఆరోగ్యకరమైన సమాజం నిర్మించవచ్చు.

– శ్రీనాథ్, ఏఓ, అర్బన్ మండలం

ఆయిల్‌పామ్‌తో అధిక లాభాలు

ఏడీఏ పద్మ



చిన్నకోడూరు(సిద్దిపేట): మాట్లాడుతున్న ఏడీఏ

చిన్నకోడూరు(సిద్దిపేట)/చేర్యాల(సిద్దిపేట): రైతులు ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఏడీఏ పద్మ సూచించారు. మండల పరిధిలోని అనంతసాగర్ తదితర గ్రామాల్లో గురువారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకే భూమిలో నాలుగు రకాల పంటలు సాగుచేసి మూడింతల అధిక ఆదాయం పొందవచ్చన్నారు. ఒక్కసారి సాగుచేస్తే 35ఏళ్ల వరకు దిగుబడి వస్తుందని, రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని సూచించారు. ఆమె వెంట ఏఓ జయంత్ కుమార్, ఉద్యానశాఖ అధికారి బాలాజీ, ఏఈఓలు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ఆయిల్‌పామ్ తోటల్లో రైతులు క్రమం తప్పకుండా యాజమాన్య పద్ధతులను పాటించాలని మండల ఏఓ మల్లేశం సూచించారు. చెప్యాలలో ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించారు. 32 నెలల వయసు వచ్చే వరకు ఆడ, మగ పుష్పాలను తప్పకుండా తొలగించాలన్నారు. మండల ఉద్యాన అధికారి రమేశ్, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రశాంత్ పాల్గొన్నారు.

చేర్యాల మండలం ముస్త్యాల రైతువేదికలో మండల ఉద్యాన అధికారి కౌసల్య రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించారు. చేర్యాల ఏఓ బోగేశ్, కొమురవెల్లి ఏఓ వెంకట్రావమ్మ, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ అధికారి కీర్తన పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రావణ్‌కుమార్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు చదువుతో పాటు ప్రభుత్వ కార్యాలయాలపై అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకురాలు శ్రీలత సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఒకేషనల్ విద్యార్థులను అధ్యాపకురాలు శ్రీలత గురువారం ఎమ్మార్వో కార్యాలయానికి తీసుకువెళ్లి విధులకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ప్రభుత్వ అధికారుల విధులు, రికార్డుల నిర్వహణ, దరఖాస్తుల స్వీకరణ, కంప్యూటరీకరణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఎస్‌ఐ జాన్ విల్సన్‌కు ఏసీపీ నివాళి



నివాళులర్పిస్తున్న ఏసీపీ సతీశ్ తదితరులు

హుస్నాబాద్: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో మాజీ ఎస్‌ఐ జాన్ విల్సన్ 33వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా విల్సన్ విగ్రహానికి ఏసీపీ వాసాల సతీశ్, ఎస్‌ఐ సతీశ్, జాన్ విల్సన్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు బోయిని ఎల్లయ్య తదితరులు గురువారం పూల మాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1991 డిసెంబర్ 19న విధి నిర్వహణలో ఓ బస్సులో వెళ్తుండగా మావోయిస్టులు పేల్చిన మందుపాతర ఘటనలో సీఐ యాదగిరి, ఎస్‌ఐ జాన్ విల్సన్‌తో పాటు 18మంది చనిపోయారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రజిత, సింగిల్ విండో చైర్మన్ శివయ్య, వైస్ చైర్మన్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చెస్ పోటీలతో మేధోసంపత్తి పెంపు



విజేతలతో చంద్రకళ తదితరులు

గజ్వేల్‌రూరల్: చెస్ పోటీల ద్వారా మేధోసంపత్తి పెరగడంతో పాటు తమలోని ప్రతిభను వెలికితీసేందుకు అవకాశం ఉందని ఆర్డీఓ చంద్రకళ, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఏఎంసీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ అన్నారు. పట్టణంలోని ఐఓసీలో చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్, జిల్లా ఇన్‌చార్జి ఎలియాస్‌రావ్ పర్యవేక్షణలో గురువారం జిల్లాస్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. గెలుపోటములను సమానంగా స్వీకరించి విజయం వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయిలో బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో వి.సుశాంత్, ద్వితీయ స్థానంలో చిద్విలాస్, తృతీయ స్థానంలో భానుప్రసాద్, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో వర్షిక, ద్వితీయ స్థానంలో నిహారిక, తృతీయ స్థానంలో మాధవి నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా డిసెంబర్ 31న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరుగనున్న రాష్ట్రస్థాయి చెస్ పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు నాగేశ్, భవిత, రేఖ, నాయకులు రాములుగౌడ్, అజ్గర్ తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకుల అరెస్టు

హుస్నాబాద్‌రూరల్/సిద్దిపేటఅర్బన్/నంగునూరు(సిద్దిపేట)/దుబ్బాకటౌన్: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు నాయకుల గురువారం అసెంబ్లీ ముట్టడికి పిలుపు నిచ్చిన నేపథ్యంలో పోలీసులు గురువారం వారిని పలుచోట్ల ముందస్తుగా అరెస్టులు చేశారు. హుస్నాబాద్‌రూరల్‌లో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి వెన్న రాజు, ఆరె కిశోర్, సుమన్, సదానందం తదితరులను అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. అలాగే సిద్దిపేట అర్బన్ మండల నాయకులు కనకమల్లేశం యాదగిరి, లింగం, మల్లేశం, శ్రీహరి, సత్తయ్య తదితరులను త్రీ టౌన్ పోలీసులు అరెస్టుచేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. నంగునూరు మండలం రాజగోపాల్‌పేట పోలీసులు మాల మహానాడు జిల్లా కన్వీనర్ బాలపోచయ్య, నాయకులు నర్సింగరావు, రమేశ్, రవి, మహేందర్, కనకరాజును అదుపులోకి తీసుకొని సాయంత్రం విడిచిపెట్టారు. దుబ్బాక అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు లింగం మాట్లాడుతూ నాయకులను అరెస్టుచేయడం సరికాదన్నారు. రాజశేఖర్, నరేశ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు స్వామి, సురేశ్, ఎల్లం, తదితరులున్నారు.

పీడిత ప్రజల దేవుడు అంబేడ్కర్

- అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు
- పలు చోట్ల దిష్టిబొమ్మలు దహనం
- క్షమాపణలు చెప్పాలంటూ డిమాండ్

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలపై జిల్లా వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. మండల కేంద్రాల్లో కాంగ్రెస్ నేతలు, దళిత, బీసీ సంఘాల నాయకులు గురువారం అమిత్‌షా దిష్టిబొమ్మలు దహనం చేసి ఆందోళనకు దిగారు. పలుచోట్ల నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ పీడిత ప్రజల దేవుడని, ఆయనను అవమానిస్తే దేశాన్ని అవమానించినట్టే అన్నారు. అమిత్‌షాను మంత్రి పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.



దుబ్బాక: నిరసన తెలుపుతున్న డీఎస్‌పీ నాయకులు



హుస్నాబాద్: అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జేఏసీ నాయకులు



చేర్యాల(సిద్దిపేట): చేర్యాలలో..



దౌల్తాబాద్(దుబ్బాక): మాట్లాడుతున్న రాములు



సిద్దిపేటరూరల్: నారాయణరావుపేటలో..

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

అవగాహన కార్యక్రమాల్లో సీఐలు, ఎస్‌ఐలు



ములుగు(గజ్వేల్): సదస్సులో మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

ములుగు(గజ్వేల్)/గజ్వేల్‌రూరల్/తొగుట(దుబ్బాక)/అక్కన్నపేట(హుస్నాబాద్): మత్తు పదార్థాలు, డ్రగ్స్ నివారణ, సైబర్ నేరాలపై సీఐలు, ఎస్‌ఐలు విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. కొన్ని చోట్ల డ్రగ్స్ కోసం తనిఖీలు చేపట్టి ప్రజలకు వివిధ సూచనలు చేశారు. ములుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించి కార్యక్రమంలో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ మత్తుపదార్థాలు, డ్రగ్స్‌కు బానిసలు కావొద్దన్నారు. విద్యార్థులకు రక్షణ చట్టాలు, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ విజయ్‌కుమార్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గజ్వేల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో జ్వేల్ సీఐ సైదా అదనపు సీఐ ముత్యంరాజుతో కలిసి పలువురికి కౌన్సిలింగ్ ఇచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్ కోసం దృష్టి సారించాలని సూచించారు. తొగుట మండలం తుక్కాపూర్ శివారులో గల కేపీఎన్ఆర్ సంస్థలో సీఐ లతీఫ్ నార్కోటిక్స్ డాగ్స్‌తో తనిఖీలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఎస్‌ఐ రవికాంత్ రావు, సిబ్బంది పాల్గొన్నారు. అక్కన్నపేట మండలం అంతక్కపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఐ విజయ్‌భాస్కర్ విద్యార్థులకు యాంటీ హ్యూమన్, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

సంక్షిప్త వార్తలు

◆ నూతన కార్యవర్గం ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా జీవశాస్త్ర ఉపాధ్యాయుల నూతన కార్యవర్గాన్ని జీవశాస్త్ర ఉపాధ్యాయులు గురువారం జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎంపికచేశారు. జిల్లా అధ్యక్షుడిగా చామకూర అనిల్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కామసముద్రం నాగరాజు, ఆర్థిక కార్యదర్శిగా లింగ శ్రీనివాస్, స్టేట్ కౌన్సిలర్స్ గా శ్రీనివాస్ రెడ్డి, మల్లారెడ్డి, మాధవి నియామకమయ్యారు. ముఖ్య అతిథిగా జిల్లా సైన్స్ అధికారి కల్లెపల్లి శ్రీనివాస్ హాజరయ్యారు. విద్యార్థులను నాణ్యమైన విద్యను అందించే విధంగా అందరం కృషి చేద్దామన్నారు.

◆ ఇసుక డంపులు స్వాధీనం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని జాలపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుక డంపులను గురువారం సీజ్ చేసినట్లు ఆర్ఐ రవీందర్ తెలిపారు. జాలపల్లి మోయతుమ్మెద వాగు నుంచి గ్రామానికి చెందిన మెతుకు రామకృష్ణారెడ్డి ఎలాంటి అనుమతులు లేకుండా 16 ట్రాక్టర్ల ఇసుకను తవ్వి తన వ్యవసాయ బావి వద్ద నిల్వ చేసినట్లు తెలిపారు. ఆయన వెంట ఎస్‌ఐ షేక్ మహబూబ్, సిబ్బంది ఉన్నారు.

◆ బెజ్జంకి పీఎస్ తనిఖీ

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి పోలీస్ స్టేషన్‌ను సిద్దిపేట ఏసీపీ మధు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, సీసీ కెమెరాల నిర్వహణ, ఇన్వెస్టిగేషన్ వివరాలను పరిశీలించారు. రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

◆ హెచ్‌ఎంలకు ప్రమోషన్లు కల్పించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): ఉపాధ్యాయ ఉద్యోగ ఖాళీలకు అనుగుణంగా గెజిటెడ్ హెచ్‌ఎంలకు ప్రమోషన్లు కల్పించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పట్నం భూపాల్ డిమాండ్ చేశారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో గురువారం ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. నాయకులు రవీందర్‌రెడ్డి, భూపాల్, రాజేశం, జాన్‌కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

◆ మహాసభల్లో విద్యారంగంపై చర్చ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నల్గొండలో 28, 29, 30లలో నిర్వహించనున్న యూటీఎఫ్ రాష్ట్ర మహాసభల్లో ప్రభుత్వ విద్యారంగంపై చర్చ జరుగుతుందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు షేక్ వలీ, తప్పెట్ల యాదగిరి చెప్పారు. రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు యాదగిరి, కృష్ణ, వెంకట కిరణ్, ప్రవీణ్ కుమార్, రాంచంద్రం, కృష్ణంరాజు, యాదయ్య, మమత తదితరులు పాల్గొన్నారు.

◆ పేదలందరికీ ఇళ్లు ఇవ్వడమే లక్ష్యం

మిరుదొడ్డి(దుబ్బాక): పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాతూరి వెంకట్‌స్వామి అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులతో కలిసి గురువారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వంశీ కుమార్, సుమలత, వెంకటేశం, చందు, విజయ తదితరులు పాల్గొన్నారు.

◆ నేడు బహిరంగ వేలం

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని కొండపోచమ్మ ఆలయంలో శుక్రవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ రవికుమార్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం పది గంటలకు ఆలయం వద్ద వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు ముందుగానే డీడీలు, డిపాజిట్‌లు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

◆ రాష్ట్ర మహాసభల కరపత్రాల ఆవిష్కరణ

గజ్వేల్‌రూరల్: సీపీఎం రాష్ట్ర 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. గురువారం గజ్వేల్‌లో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 25 నుండి 28వరకు సంగారెడ్డిలో రాష్ట్ర మహాసభలు జరుగనున్నాయన్నారు. కెరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో పాటు కేంద్ర, రాష్ట్ర నాయకులు హాజరవుతున్నారన్నారు. బండ్ల స్వామి, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ రూ.50వేల ఆర్థిక సహాయం

దుబ్బాకటౌన్: ఆపదలో ఉంటే ఆదుకోవడమే నిజమైన స్నేహానికి అర్థమని నిరూపించారు ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2001- 2002 బ్యాచ్ 10వ తరగతి స్నేహితులు. తమ స్నేహితురాలు బాల్‌లక్ష్మి భర్త నర్సింహులు ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకుని వారు గురువారం రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో వారి కుటుంబాన్ని పరామర్శించారు. రూ.50వేల ఆర్థిక సహాయం, 50కిలోల బియ్యం అందజేశారు. కనకయ్య, స్వామి, శ్రీరామ్, సత్యనారాయణ, రాజు, శ్రీలత, రాజేశ్వరి, జ్యోతి, భార్గవి, సత్యలక్ష్మి, భవాని తదితరులు పాల్గొన్నారు.